సాక్షి

హనుమకొండ

సోమవారం | 13 | మార్చి | 2023



మారో వివాదంలో కార్పొరేటర్

ఓ స్థలం విషయంలో యజమానిని బెదిరించిన కేసులో జైలుకు వెళ్లి వచ్చిన కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ మరో వివాదం లో చిక్కుకున్నాడు. - 8లో▸



వైభవంగా గంధం ఉత్సవాలు

దామెర మండలం ఓగ్లాపూర్ సమీప సైలానీ బాబా దర్గాలో గంధం ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం $36^0/21^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి పూట చలి మామూలుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముగిసిన అథ్లెటిక్స్ ఎంపికలు



వరంగల్ స్పోర్ట్స్: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన హనుమకొండ, వరంగల్ జిల్లాల మహిళల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఎంపికల ప్రక్రియ 10 గంటల వరకు ముగిసినట్లు నిర్వాహకుడు సారంగపాణి తెలిపారు. 100, 200, 400, 800, 1500, 3000 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో విభాగాల్లో రెండు జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 19న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి మొదటి మహిళా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపిక పోటీల్లో కోచ్ శ్రీమన్నారాయణ, పీఈటీ సాంబమూర్తి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

హన్మకొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఈనెల 13న ఉచిత మహిళా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లల అక్రమ దత్తతపై ఫిర్యాదు


కాజీపేట సెంటర్: జిల్లాలో పసిపిల్లలను అక్రమంగా దత్తత చేసుకున్నారనే ఆరోపణలు, తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలకు సంబంధించిన వారి డబ్బులను అధికారులు స్వాహా చేశారనే ఆరోపణపై రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్‌కు డీసీపీఓ జి. మహేందర్‌రెడ్డి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. చట్టాలకు వ్యతిరేకంగా పిల్లలను దత్తత చేసుకున్నారనే ఆరోపణలు, కార్యాలయంలో రహస్యంగా ఉండాల్సిన రికార్డులు బయటకు వెళ్లడం, తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై జనవరి నెలలోనే బాలల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో మళ్లీ శనివారం కమిషన్‌కి ఫిర్యాదు చేయడం జరిగిందని డీసీపీఓ విలేకరులతో తెలిపారు.

భక్తుల కోలాహలం




ఎస్ఎస్ తాడ్వాయి: మేడారానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. జంపన్నవాగు షవర్ల కింద స్నానాలు ఆచరించి అమ్మవార్ల గద్దెల వద్దకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ, చీర సారె, ఎత్తు బంగారం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు పూజలు చేశారు. అనంతరం మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి సహపంక్తి భోజనాలు చేశారు. సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉగాదితో జాతర ఉత్సవాలు ముగుస్తున్నందున వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు బోనాలు, పట్నాలతో మొక్కులు చెల్లించుకున్నారు.



ఆత్మల సంతకాలు సమాధులే సాక్ష్యాలు



ఆత్మలు వచ్చాయి.. తహసీల్దార్ ఎదుట హాజరై అఫిడవిట్‌పై సంతకం చేశాయి. వాటిని పరిశీలించిన తహసీల్దార్ ఓకే చెప్పాడు. ఇంకేముంది రూ.కోట్ల విలువైన వ్యవసాయ భూమి పేరు బదలాయింపు జరిగింది. సాదాబైనామాల ద్వారా పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న వారి నోట్లో మట్టి పడగా.. ఆ భూమి కబ్జాదారుల పరమైంది. ఇదెక్కడో కాదండీ.. హనుమకొండ జిల్లా కాజీపేట తహసీల్దార్ కార్యాలయ పరిధిలో జరిగిన ఓ భూ దందా.

- హన్మకొండ అర్బన్

ఆత్మలుగా వచ్చిన వారసులు.. ధరణి చట్టానికి తూట్లు

ధ్రువీకరించింది కాజీపేట తహసీల్దార్

- కోట్ల విలువైన భూమి.. కబ్జాదారుల పాలు
- కలెక్టర్‌నూ తప్పుదోవ పట్టించిన తహసీల్దార్
- బాధితుల గోడు వినేదెవరు?

సాక్షి ఎక్స్‌క్లూజివ్

కాజీపేట మండలం రాంపూర్ గ్రామం.. వరంగల్ – హైదరాబాద్ హైవేలో ఉంటుంది. ఇక్కడ భూముల ధరలు ఎకరా రూ.కోట్లలో పలుకుతున్నాయి. ఇక్కడ ఓ అమాయక కుటుంబానికి సంబంధించి విలువైన స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. భూమికి సంబంధించి పూర్వాపరాలు సేకరించారు. ప్రస్తుతం ఆ భూమికి యజమానులుగా ఉంటున్నవారు.. సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసి వారి పూర్వీకులనుంచి అనుభవిస్తున్నారు. వారసత్వంగా సాగు చేసుకుంటున్నారు. కానీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఈ భూమి దశాబ్దాల కిత్రం చనిపోయిన వ్యక్తి పేర్లతోనే కొనసాగుతోంది. ఈ విషయంలో పట్టాదారుల కాలంలో ఉన్నవారి బంధువులు.. ప్రస్తుతం భూమిని అనుభవిస్తున్న వారికి మధ్య ఎలాంటి తగాదా లేదు. ఇక భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డులు సక్రమంగా లేవని తెలుసుకున్న కొందరు అక్రమార్కులు ఆ భూమిపై కన్నేశారు. కబ్జాకు చక్రం తిప్పారు. మొదట భూమి వారికి ఎంతో కొంత తీసుకుని ఖాళీ చేసి వెళ్లాలని బెదిరించారు. అది తప్ప తమకు వేరే దారిలేదని, తాము వదిలేది లేదని చెప్పడంతో ఇక ప్లాన్ బీ అమలుకు సిద్ధమయ్యారు.

ప్లాన్ బీలో వారసులొచ్చారు..

రాంపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 438/1/1లో 10 గుంటలు, 438/1/2లో 10గుంటలు, 438/1/3లో 20గుంటలు, 438/1/4లో 19గుంటలు మొత్తం 1.19ఎకరాల భూమి ఉంది. దీని విలువ రూ.కోట్లలో ఉంటుంది. కాస్తులో ఉన్నవారు నయానా భయానా వినలేదని.. కబ్జాదారులు ప్లాన్ బీలో భాగంగా కాజీపేట తహసీల్దార్‌ను సంప్రదించారు. ఎలాగైనా ఆ భూమి తమకు దక్కేలా సహకరించాలని కోరారు. అందులోని లోటుపాట్లు చర్చించారు. పెద్ద మొత్తం ధరకు డీల్ ఓకే చేసుకున్నారు. తనకు ఏమేం పత్రాలు కావాలో తహసీల్దార్ చెప్పారు. దీంతో పట్టాదార్ ఇంటి పేరు కలిసేవారిని, దూరపు బంధువులను సంప్రదించి చివరకు వృద్ధాప్యంతో చివరి దశకు చేరుకున్న సండ్ర చంద్రమ్మ భర్త పేరు రామచంద్రయ్య ఆలియాస్ రాంచంద్రం అనే మహిళను పట్టాదార్ భార్యగా తెరమీదకు తీసుకువచ్చారు. ఆమె పేరుతో తతంగం నడిపారు. మొత్తం భూమి ఆమె పేరు మీదకు తీసుకువచ్చే విధంగా చేశారు. ఈక్రమంలో పట్టాదార్‌గా ఉన్న సండ్ర రాంచంద్రయ్యతోపాటు ఆ భూమికి వారసులుగా ఉన్నవారు అందరూ కూడా రాంచంద్రయ్య భార్య పేరు మీదకు ఆస్తి మార్పిడి చేస్తే తమకు అభ్యంతరం లేదని, ఇది తాము పూర్తిగా స్పృహలో ఉండి చెబుతున్న విషయం అని సండ్ర ఆంథ్రయ్య, సండ్ర సాల్మన్, సండ్ర ఐలయ్య, సండ్ర గట్టుమల్లు విడివిడిగా అఫిడవిట్లను కాజీపేట తహసీల్దార్ ముందు హాజరై అందజేశారు. వారి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్న తహసీల్దార్ లిఖిత పూర్వక అంగీకారం కోసం వారి అఫిడవిట్ తీసుకున్నారు. ఇక్కడి దాకా కథను అధికారులు, కబ్జాదారులు బాగానే రక్తి కట్టించారు..

వెంటనే అమ్మకం

ఈ వ్యవహారంలో వచ్చిన పేర్లలో సండ్ర చంద్రమ్మ మినహా మిగతా అన్నీ ఆత్మలే.. అయితే చంద్రమ్మ కూడా వయస్సు, ఆరోగ్య రీత్యా దగ్గర పడుతోందని ముందే గ్రహించిన గ్యాంగ్ ఆలస్యం చేయకుండా ఆ భూమిని సేల్ డీడ్ ద్వారా వెంటనే సండ్ర ప్రభాకర్ పేరుతో మార్చుకున్నారు. తర్వాత వారు ఊహించినట్లే కొద్ది రోజులకే 2022లో సండ్ర చంద్రమ్మ కూడా మరణించింది. ఆత్మలు సంతకాలు చేసి... అఫిడవిట్లు ఇచ్చి, సమాధులు సాక్ష్యంగా నిలిచిన ఈ వ్యవహారంలో పెద్దమొత్తంలో చేతులు మారాయి. అధికారులకు, కబ్జా గ్యాంగ్‌కు భయపడి బాధితులు బయటికి చెప్పలేక బిక్కుబిక్కుమంటున్నారు.

15 ఏళ్ల క్రితం చనిపోయిన వారు లేసొచ్చారా?

ఈ భూ బాగోతంలో రెవెన్యూ అధికారులకు తోడుగా కబ్జాదారులు చేసిన తతంగం లోతుగా పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు బయటకొచ్చాయి. కాజీపేట తహసీల్దార్.. హనుమకొండ కలెక్టర్‌కు పంపిన సక్సేషన్ ప్రతిపాదన నివేదిక ప్రకారం.. అందులో ఉన్న పేర్లు పరిశీలిస్తే.. ప్రస్తుతం అఫిడవిట్లు ఇచ్చిన వారిలో ఒక్కరు కూడా బతికిలేరు. వారంతా ఎప్పుడో చనిపోయారు. 15 సంవత్సరాల క్రితం.. అంటే 2006 నుంచి 2016 మధ్య కాలంలో వేర్వేరు సమయాల్లో చనిపోయారు. దానికి గుర్తుగా వారి కుటుంబం సంప్రదాయం ప్రకారం.. సమాధులు నిర్మించుకున్నారు. వాటిపై వారి పేరు.. వారి పుట్టిన, మరణించిన తేదీలు స్పష్టంగా రాసి పెట్టుకున్నారు. భూమి బదలాయింపులో అభ్యంతరం లేదని కాజీపేట తహసీల్దార్ ఎదుట 2021 నవంబర్ 11న హాజరై ఆయనకు స్వయంగా అఫిడవిట్ అందజేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. 2016లోపు మరణించిన వారు 2021 సంవత్సరంలో ఎలా బతికి వచ్చారో తహసీల్దారే తెలియాల్సి ఉంటుంది.

కలెక్టర్‌ను తప్పుదోవ..

అఫిడవిట్లను ఓకే చేసిన కాజీపేట తహసీల్దార్ వాటిపై కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. పట్టాదారుగా ఉన్న రాంచంద్రయ్య మరణించినందున ప్రస్తుతం బతికున్న ఆయన భార్య సండ్ర చంద్రమ్మ పేరుతో పట్టదార్ పాస్‌బుక్ ఇచ్చి.. సక్సేషన్ ద్వారా హక్కు కల్పించవచ్చని ప్రతిపాదన పంపించారు. తహసీల్దార్ పరిశీలన నివేదిక వాస్తవమని నమ్మిన అప్పటి కలెక్టర్.. సండ్ర చంద్రమ్మను ఆస్తికి హక్కుదారుగా గుర్తించి వారసత్వం(సక్సేషన్) ఆస్తిగా ఆమె పేరుమీదికి మార్చారు.

అక్కడన్నీ అక్రమాలే..

కాజీపేట మండలంలో జరిగే రెవెన్యూ వ్యవహారాల్లో ఇలాంటి తతంగాలే ఎక్కువగా ఉన్నాయి. అక్కడ అధికారులు అక్రమాల్లో ప్రత్యేకంగా ఏజెంట్లను పెట్టుకుని ఇలాంటి దందా నడిపిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో తహసీల్దార్లు ఒకే మండలంలో మూడేళ్లకు పైగా పాతుకు పోవడంవల్ల ఇలాంటి వ్యవహారాలకు ఆస్కారం ఏర్పడుతోందని విమర్శలు ఉన్నాయి. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో చూడాలి.

ఆత్మలు వచ్చి అఫిడవిట్లు ఎలా ఇచ్చాయంటే..



ఇది సండ్ర ఆంథ్రయ్య సమాధి. 2015, జనవరి 23 (శుక్రవారం) చనిపోయారు. కానీ ఇతను 2021 నవంబర్ 15న తహసీల్దార్ ఎదుట హాజరై అఫిడవిట్ సమర్పించారు.



ఇది సండ్ర సాల్మన్ సమాధి. ఈయన 2016 డిసెంబర్ 15న చనిపోయారు. ఇతను కూడా 2021 నవంబర్ 15న తహసీల్దార్ ఎదుట హాజరై అఫిడవిట్ సమర్పించారు.



ఇది సండ్ర ఐలయ్య సమాధి. ఈయన 2013 డిసెంబర్ 6వ తేదీన మరణించారు. కానీ ఇతను 2021 నవంబర్ 15న తహసీల్దార్ ఎదుట హాజరై అఫిడవిట్ సమర్పించారు.



ఈ సమాధి సండ్ర గట్టుమల్లుది. 2006 మార్చి 3వ తేదీన చనిపోయారు. ఇతను కూడా 2021 నవంబర్ 15న తహసీల్దార్ ఎదుట హాజరై అఫిడవిట్ సమర్పించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ దొంగ నాటకాలు

- లిక్కర్ స్కామ్ నుంచి దృష్టి మళ్లించేందుకే మహిళా బిల్లు అంశం
- పీసీసీ గోవా మాజీ అధ్యక్షుడు గిరీష్ చోదాంకర్
- హనుమకొండలో 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర
- పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు 'నాయిని'



యాత్రలో పాల్గొన్న గిరీష్ చోదాంకర్, నాయిని రాజేందర్ రెడ్డి, తదితరులు

హన్మకొండ: లిక్కర్ స్కాం కేసులో బీజేపీ, బీఆర్‌ఎస్ దొంగనాటకాలు ఆడుతున్నాయని పీసీసీ గోవా మాజీ అధ్యక్షుడు, 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర తెలంగాణ ఇన్‌చార్జ్ గిరీష్ చోదాంకర్ అన్నారు. ఆదివారం హనుమకొండలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన యాత్రను హనుమకొండ గోకుల్‌కూడలిలో నాయిని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అశోక కాలనీ, వికాస్‌నగర్, అమరావతినగర్, టీవీ టవర్ కాలనీ, వాజిపేయి నగర్, కృష్ణాకాలని మీదుగా గోకుల్‌నగర్ పోచమ్మ దేవాలయం వరకు సాగిన యాత్ర సందర్భంగా గిరీష్ చోదాంకర్, నాయిని ప్రజలతో ముచ్చటిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ పాలనా వైఫల్యాలను, రాహుల్ గాంధీ సందేశాన్ని ఇంటింటికీ వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా గిరీష్ చోదాంకర్ మాట్లాడుతూ లిక్కర్ స్కాం నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి కల్వకుంట్ల కవిత మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ముందుకు తెచ్చిందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు దేశ ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ అదానీ, అంబానీలకు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలను బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేసిందన్నారు. తెలంగాణ వస్తే ప్రజల బతుకులు మారుతాయని, బాధలు పోతాయని నమ్మితే కేసీఆర్ చేసింది ఏమీ లేదని విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణాలో నిరుద్యోగుల చావులు, రైతుల ఆత్మహత్యలు, సామాన్య ప్రజల నెత్తిపై అప్పులు తప్ప ఎలాంటి ప్రయోజనాలు లేవని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, నాయకులు నసీం జహాన్, బంక సంపత్ యాదవ్, లలిత, బి.భాగ్యలక్ష్మి, చాముండేశ్వరి, విజయ, బొంత సుజాత,బొల్లు కిషన్, మురళి, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తాటికల్లు మస్తుగుంది..!



కల్లు రుచిచూస్తున్న మంత్రి ఎర్రబెల్లి

కొడకండ్ల: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం జనగామ జిల్లా కొడకండ్లలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా గీత కార్మికుల కోరిక మేరకు తాటి కల్లు టేస్ట్ చూసి చాలా బాగుందని అభినందించారు. కల్లుతో ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నందున నీరా కేఫ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మంత్రి తెలిపారు.

'బండి'ని అరెస్టు చేయాలి

- మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలి
- ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని అరెస్టు చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పార్టీ మహిళా విభాగం సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేసే వరకు మహిళలతో కలిసి ఆందోళనలు చేపడతామన్నారు. మహిళా కమిషన్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై బీజేపీ వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమన్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని కల్వకుంట్ల కవిత పోరాటం చేస్తుంటే.. బీజేపీ కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ అక్రమంగా కేసులు బనాయించాలని చూస్తోందన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పారిశ్రామిక రంగంలో ఆసక్తి కలిగిన మహిళలకు వీ హబ్ ద్వారా వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్య పరీక్షలకు ఈనెల 13న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాన్సర్, ఇతర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తారని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, దాస్యం రేవతి దంపతులు బహుమతులు ప్రదానం చేశారు. సమావేశంలో పాల్గొన్న మహిళలకు మహిళా దినోత్సవ కానుకలు అందించారు. 'కుడా' మాజీ చైర్మన్ మర్రియాదవరెడ్డి, కార్పొరేటర్లు సోదా కిరణ్, చెన్నం మధు, ఇమ్మడి లోహిత, నెక్కొండ కవిత, మానస, చీకటి శారద తదితరులు పాల్గొన్నారు.

గోడు ఆలకించేదెవరు?

ఫిర్యాదుల స్వీకరణకు గంటన్నరే

- కొరవడిన జవాబుదారీతనం
- సమీక్షలు, సమావేశాల్లేక పెండింగ్‌లో సమస్యలు
- గ్రేటర్ గ్రీవెన్స్‌పై ప్రజల్లో అపనమ్మకం



వినతులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు అందజేసేందుకు ఒక వ్యక్తికి సరాసరి అవుతున్న ఖర్చు వంద రూపాయలు. వ్యయప్రయాసలకోర్చి వస్తున్న ప్రజల సమస్యలు వినేందుకు అధికారులు సమయం ఇవ్వట్లేదు. ప్రజలు ఉదయం 11 గంటలకు బల్దియా కార్యాలయానికి చేరుకుని ఇన్‌వార్డులో రశీదు తీసుకొని క్యూలో నిలబడి అధికారులకు వినతులు అందజేస్తున్నారు. 11:30 నుంచి మధ్యాహ్నం 1 దాటగానే అధికారులు వెళ్లిపోతున్నారు. గతంలో కమిషనర్లు గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలందరి నుంచి వినతులు స్వీకరించేవారు. కానీ ఆర్నెళ్లుగా బల్దియాలో కొత్త నిబంధన పెట్టారు. సమయం అయిపోయిందని, ఇన్‌వార్డులో అందజేసి, రశీదు పొందాలని సూచిస్తున్నారు. దీంతో తమ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశగా వస్తున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది.

కమిషనర్ రాకపోతే?

కమిషనర్ ఇతర పనులరీత్యా గ్రీవెన్స్‌కు హాజరవ్వకపోతే గ్రీవెన్స్ సెల్ వెలవెలపోతుంది. చాలా మంది అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అలా కనబడి.. ఇలా జారుకుంటున్నారు. కొంతమంది అధికారులు ప్రజా సమస్యల్ని పెడచెవిన పెడుతున్నారు.స మస్య తీవ్రతను వివరించేందుకు ప్రజలు యత్నిస్తుంటే మొబైల్ వాట్సాప్ చాటింగ్‌లో నిమగ్నమవుతున్నారు.ఇలా.. గ్రేటర్‌గ్రీవెన్స్ సెల్ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఆరా తీసేవారేరి?

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జీడబ్ల్యూఎంసీ అధికారులు వేగంగా స్పందించట్లేదు. దీంతో చాలా మంది పదే పదే ఫిర్యాదులు అందజేస్తున్నారు. వందల సంఖ్యలో వినతులు కుప్పలుగా పేరుకుపోయాయి. గతంలో ప్రతీ వారం గ్రీవెన్స్ సెల్‌లో అందిన వినతులపై సమీక్షలు జరిగేవి. ఆకస్మిక తనిఖీలు, ఫిర్యాదులపై ఆరా తీయడం, పనుల స్థితిగతులను తెలుసుకునేవారు. ఏడాదిన్నరగా వాటి ఊసే లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నా వాటి పరిష్కారానికి అధికారుల నుంచి సరైన సమాధానాలు కరువయ్యాయి. చిన్నాచితక చెత్త సమస్య, వీధి దీపాలకు మాత్రమే పరిష్కారం లభిస్తోంది. అభివృద్ధి పనులకు సంబంధించిన వినతులపై నిధులు లేవని అధికారులు తెగేసి చెబుతున్నారు. అధిక మొత్తం టౌన్ ప్లానింగ్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై వేల సంఖ్యలో సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. వాటిపై కనీసం కన్నెత్తి కూడా చూడకుండానే, సమస్యలు పరిష్కరించినట్లు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం అందిస్తున్నారు. దీంతో గ్రేటర్ గ్రీవెన్ సెల్‌పై ప్రజల్లో నమ్మకం కొరవడుతోంది. ఉన్నతాధికారులు, పాలక వర్గం తమ గోడుపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు గ్రేటర్ గ్రీవెన్స్

వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు.

కేంద్రం నిధులను దారిమళ్లిస్తున్న రాష్ట్రం

- బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్



సమావేశంలో మాట్లాడుతున్న తరుణ్‌చుగ్

వరంగల్: కేంద్రం స్మార్ట్ సిటీ, అమృత్, హెరిటేజ్ పథకాల కింద నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా విడుదల చేయకపోగా కేంద్ర నిధులను మళ్లిస్తోందని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆరోపించారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన వరంగల్ లోక్‌సభ ప్రవాస్‌యోజన, కోర్ కమిటీ సమావేశాల అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రం స్మార్ట్‌సిటీ కింద రూ.192కోట్లు, వరంగల్–హైదరాబాద్ ఎన్‌హెచ్‌కు రూ.1905కోట్లు ఇచ్చిందని, ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి 50 శాతం నిధులు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగంలో ఎవరికీ మినహాయింపు ఉందని పేర్కొన్న ఆయన.. దర్యాప్తు ఏజెన్సీలు భారత చట్టాలను అమలు చేస్తాయని చెప్పారు. ముడుపులు తీసుకున్న వారు ఎంతటివారైనా నిజమని తేలితే శిక్ష తప్పదని పేర్కొన్నారు. నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, వన్నాల శ్రీరాములు, మార్తినేని ధర్మారావు, గుండె విజయరామారావు, కొండేటి శ్రీధర్, రావుపద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, అల్లం నాగరాజు, రాకేష్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మారిపెల్లి రామచంద్రారెడ్డి, కె.త్రిలోకేశ్వర్, బాకం హరిశంకర్, డాక్టర్ వెంకటరమణ, రజనీష్ పాల్గొన్నారు.

మరో వివాదంలో కార్పొరేటర్..

- పార్కింగ్ కోసం స్మార్ట్‌సిటీ పనులు ధ్వంసం చేసిన శ్రీనివాస్
- అడ్డుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త కిషన్


జేసీబీతో ధ్వంసం చేసిన స్మార్ట్ సిటీ పనులు

హన్మకొండ అర్బన్ : ఇప్పటికే ఓ స్థలం విషయంలో యజమానిని బెదిరించారనే ఆరోపణలతో జైలుకెళ్లి వచ్చిన కార్పొరేటర్ వేముల శ్రీనివాస్ మరో వివాదంలో చిక్కుకున్నాడు. 30వ డివిజన్ పరిధిలోని హన్మకొండ బస్టాండ్ సమీపంలో కుడాకు సంబంధించి కొత్త కాంప్లెక్స్ లీజ్‌కు తీసుకున్నాడు. ఈ కాంప్లెక్స్‌కు సంబంధించి ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో కాంప్లెక్స్ ముందు స్మార్ట్ సిటీపనుల్లో భాగంగా గ్రేటర్ మున్సిపాలిటీ వారు నిర్మించిన డ్రెయినేజీ నిర్మాణాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ భర్త రావుల కిషన్ పనులు అడ్డుకున్నాడు. స్మార్ట్‌సిటీ పనులు ఎలా ధ్వంసం చేస్తారంటూ మండిపడ్డారు. పనులు చేస్తున్న జేసీబీని స్వాధీనం చేసుకుని వేరేచోటుకు పంపించారు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేస్తామని కిషన్ తెలిపారు. తన కాంప్లెక్స్ ముందు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును పార్కింగ్ కోసం వినియోగించడానికి కార్పొరేటర్ శ్రీనివాస్ స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు పనులు ధ్వంసం చేస్తున్నారని కిషన్ ఆరోపించారు. దీనిపై యంత్రాంగం స్పందించాలన్నారు. యథావిధిగా నిర్మాణం చేయాలని లేదంటే ఆందోళనకు దిగుతామన్నారు హెచ్చరించారు. ప్రస్తుతం పనుల వల్ల రానున్న రోజుల్లో రోడ్డు మొత్తం పార్కింగ్ కోసం వాడుకునే ప్లాన్ ఉందన్నారు. దీంతో బస్టాండ్ ప్రధాన కూడలిలో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని అన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పుచ్చకు ‘పురుగు’ల బెడద

- తెగుళ్లతోనూ తిప్పలే
- సస్యరక్షణ చర్యలు తీసుకుంటే మేలు : శాస్త్రవేత్తలు


పుచ్చకాయను ఆశిస్తున్న పురుగులు





తెగుళ్లతో దెబ్బతిన్న పుచ్చకాయ

కరీమాబాద్: ఎంతో ఆశతో రైతులు సాగు చేస్తున్న పుచ్చ పంటకు పురుగుల బెడద పీడిస్తోంది. కాపు ద శకు వచ్చిన సమయంలో వివిధ రకాల పురుగులు, తెగుళ్లు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న పంట దెబ్బతింటుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే సస్యరక్షణ చర్యలు తీసుకుంటే ఎలాంటి సమస్యలు రాకుండా అధిక దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పండు ఈగ.. నివారణ

పండు ఈగ పురుగులు పూత దశలో ఆశిస్తూ పువ్వులపై గుడ్లు పెట్టడమే కాకుండా పూత, మొగ్గల్లోకి చేరి నష్టం చేస్తాయి. అయితే వాటి నివారణకు మలాథియాన్ మందు పిచికారీ చేయడమే కాకుండా ఎకరానికి 2 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడంతోపాటు కుళ్లిన కాయలు తీసేయాలి.



పెంక పురుగులు.. నివారణ

ఈ పురుగులు ఆకులపై రంధ్రాలు చేస్తాయి. తీగ పాకే సమయంలో ఆకుల మీద ఎక్కువ నష్టం చేస్తాయి. పెంక పురుగు నివారణ కోసం ట్రైకోఫోరాన్ పొడిని గానీ మందును గానీ మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

గొంగళి పురుగు.. నివారణ

ఈ రకం పురుగులు పంటపై అన్ని దశల్లోనూ ఆశిస్తాయి. ఆకులను తిని పత్రాలను నష్టపరుస్తాయి. దీంతో మొక్క ఎదగకపోవడమే కాకుండా దిగుబడిపై ప్రభావం పడుతుంది. అయితే వాటి నివారణకు థయోడికార్బ్, క్లోరోపైరిఫాస్ మందులను మొతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

నులి పురుగులు.. నివారణ

ఈ పురుగులు మొక్క వేరు దిగువ భాగంలో చేరి బొడిపెలుగా మార్చి నష్టం చేస్తాయి. దీంతో మొక్కలు చనిపోతాయి. వాటి నివారణ కోసం కార్బోసల్ఫాన్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి. మొక్క మొదలు దగ్గర వేప పిండి వేయాలి.

బూడిద తెగులు.. నివారణ

వాతావరణంలో మార్పులతోపాటు రాత్రి చల్లగా.. పగలు వేడిగా ఉన్నప్పుడు ఈ తెగుళ్ల ఉధృతి బాగా ఉంటుంది. పూత దశలో ఎక్కువగా ఆశిస్తుంది. మొదట లేత ఆకులపై బూజు లాంటి పదార్థంగా ఏర్పడుతుంది. తర్వాత పూత, కాండం పైన, పూల మీద, చిన్న పిందెల మీద తెల్లని బూజు వస్తుంది. దీంతో పూత, కాత రాలిపోతుంది. ఈ రకం తెగుళ్ల నివారణ కోసం మాన కోజెబ్, హెక్సాకోనాజోల్, ప్రొపికోనజోల్ వంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

బూజు తెగులు.. నివారణ

ఈ తెగులు ఆశించినప్పుడు మొదట్లో ఆకుల మీద ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ కలిసినటువంటి మచ్చలు కనిపిస్తాయి. తర్వాత ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎండిపోయి రాలిపోతాయి. దీని నివారణ కోసం మెటల్‌ఆక్సిల్, మాన్‌కోజెబ్ మందులు పిచికారీ చేయాలి.

పక్షి కన్ను తెగులు.. నివారణ

ఆకులు, కాయల మీద పక్షి కన్ను వంటి గుండ్రటి మచ్చలు ఏర్పడతాయి. ఆ భాగంలో ఆకులు ఎండిపోయి రాలిపోతుంటాయి. నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్, కార్బన్డిజం, మాన్‌కోజెబ్ లాంటి మందులు పిచికారీ చేయాలి.

వెర్రి తెగులు.. నివారణ

ఈ తెగులు ఆశించిన ఆకులు మధ్య మందంగా చారలుగా ఏర్పడి పాలుసుగా మారుతాయి. దీంతో పూత, పిందె ఏర్పడడం ఆగిపోతుంది. దీని నివారణ కోసం మొక్కలను పీకి కాల్చేయాలి. అంతేకాకుండా డైమెథోయేట్, మిథియాల్ డెమిటియస్ వంటి మందులు పిచికారీ చేయాలి.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



ఎండాకాలంలో సాగు చేసే పుచ్చ పంటలో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. లోతుగా దుక్కి దున్నడంతోపాటు విత్తన శుద్ధి చేయాలి. భూములను, ప్రాంతాలను బట్టి తట్టుకునే శక్తి ఉన్న విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. మొక్క దశ నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. పురుగులు, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా మందులను పిచికారీ చేయాలి.

- డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

నాలుగు నెలలకే నూరేళ్లు నిండాయి..

- ఇంజక్షన్ వికటించి బాలుడి మృతి
- ఆర్‌ఎంపీపై కేసు నమోదు


బాలుడి మృతదేహం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి నాలుగు నెలల బాలుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రంగాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భుక్యా వీరన్న–మహేశ్వరి దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడికి (4 నెలల వయస్సు) కొద్ది రోజులుగా జ్వరం, విరేచనాలతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడు భుక్యా హాలును బాలుడి తల్లిదండ్రులు సంప్రదించగా శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో బాలుడికి ఇంజక్షన్ ఇచ్చాడు. కొంత సమయం తర్వాత ఆ బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితికి చేరడంతో వెంటనే మానుకోటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆ బాలుడు ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంటకు మృతి చెందాడు. ఆర్‌ఎంపీ వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతోనే మా కొడుకు మృతి చెందాడంటూ తల్లిదండ్రులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆర్‌ఎంపీ వైద్యుడు హాలుపై కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని మానుకోట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు రోదించిన తీరు కలచివేసింది..

బోసినవ్వులతో ఇంటిల్లిపాదిని ఆనందంలో మురిపించే బాలుడు కానరానిలోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతి చెందిన బాలుడికి ఇంకా నామకరణం చేయలేదు. ముద్దుగా పండు అంటూ పిలుచుకుంటున్న ఆ తల్లిదండ్రులు కొడుకు జ్ఞాపకాలను తలుచుకుంటూ, పండు లేవరా అంటూ రోదించిన తీరు అందరి హృదయాలను కలచివేసింది.

టైర్లను దొంగిలిస్తున్న ముఠా అరెస్ట్


నిందితులను, స్వాధీనం చేసుకున్న టైర్లను చూపుతున్న ఏసీపీ శివరామయ్య

ఆత్మకూరు: రాత్రి సమయంలో వరంగల్–ములుగు జాతీయ రహదారిపై పార్క్ చేసిన లారీలు, టిప్పర్ల టైర్లను దొంగిలిస్తున్న ముఠాను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ శివరామయ్య కథనం ప్రకారం.. ఈ మధ్య కాలంలో ఆత్మకూరు శివారుతో పాటు పలు ప్రాంతాల్లో 30 లారీ, టిప్పర్ టైర్లను పార్కు చేసిన సమయంలో దొంగిలించారు. ఈ దొంగతనాలకు పాల్పడిన ముఠాను ఆత్మకూరు పోలీసులు ఛేదించారు. మణుగూరుకు చెందిన వల్లెపు వెంకటేశ్వర్లు, మక్కల్ల ఐలయ్య, మక్కల్ల కుమార్, తమ్మనపుడి సత్యనారాయణ, వల్లెపు వెంకన్నలు, అలాగే వీరి వద్ద టైర్లను కొనుగోలు చేసిన విజయవాడకు చెందిన షేక్ ఖాజాలను పోలీసులు గుర్తించారు. నిందితులను పట్టుకొని అరెస్టు చేయగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వీరి నుంచి సుమారు రూ.3.60 లక్షల విలువ చేసే 30 టైర్లు, అశోక్ లేలాండ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న సీఐ బీ.కుమార్, ఎస్సై ప్రసాద్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

వ్యాపారులకు రూ.13 లక్షల టోకరా

కాజీపేట: తీయతీయని మాటలతో వ్యాపారులకు రూ.13 లక్షలకు పైగా కుచ్చుటోపీ పెట్టి ఓ మోసగాడు పరారైన ఘటనపై కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. సీఐ గట్ల మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఫాతిమానగర్‌లో అమర్ దీప్ ట్రేడింగ్ అండ్ కో షాపు నిర్వహిస్తున్న దినేష్ పలు షాపులు తిరుగుతూ అడ్వాన్స్‌గా చెక్కులు ఇస్తూ పైపులు, ఎలక్ట్రికల్ వస్తువులను కొనుగోలు చేస్తూ వ్యాపారులను నమ్మించాడు. సామానులు కొనుగోలు చేసి అడ్వాన్స్‌గా చెక్కులు అందించి దినేష్ పరారయ్యాడు. ఫాతిమానగర్‌లోని షాపు వద్దకు బాధిత వ్యాపారులు వెళ్లి చూడగా దుకాణాన్ని ఎప్పుడో మూసేసి సామానుతో పరారైనట్లు తెలిసింది. బాధితులు మోసపోయినట్లుగా గుర్తించి కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దినేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్యే రాజయ్య తీరుపై చర్చ

- సర్పంచ్ నవ్యపై వేధింపులతో మరోసారి తెరపైకి
- ప్రగతిభవన్‌ను తాకిన లైగింక వేధింపుల ఆరోపణలు
- మహిళా కమిషన్ సీరియస్.. సుమోటోగా స్వీకరణ
- విచారణకు డీజీపీకి ఆదేశాలు


Telangana State Commissio... · 14h
@SCWTelangana has taken cognizance of the matter. Chairperson @sunitavakiti has already written to @TelanganaDGP to personally intervene in the matter. @TelanganaToday @ntdailyonline

విచారణ చేపట్టాలని మహిళా కమిషన్ డీజీపీకి పంపించిన మెసేజ్

జనగామ: మహిళా సర్పంచ్‌పై లైగింక వేధింపుల ఆరోపణలతో ఎమ్మెల్యే రాజయ్య వ్యవహారం మరోసారి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. సోషల్ మీడియాలో నెటిజన్లు ఎమ్మెల్యే సార్‌ను ఓ ఆటా ఆడేసుకుంటున్నారు. గౌరవ ప్రదమైన హోదాలో ఉన్న ఎమ్మెల్యే.. మహిళలకు సంబంధించి తరుచూ ఏదో ఒక వివాదంలో ఇరుక్కుంటూనే ఉన్నాడు. ఎమ్మెల్యే రాజయ్య తనను లైగింకంగా వేధిస్తున్నాడని హనుమకొండ/జనగామ జిల్లా పరిధి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ కుర్సపల్లి నవ్య ఆరోపించడంతో మూడు రోజులుగా చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీతో సహా అన్ని వర్గాల నుంచి ఆగ్రహం పెల్లుబికడంతో నిరసన సెగ ప్రగతిభన్‌ను తాకింది. పార్టీ వర్గాలు ఓవైపు ఆరా తీస్తుండగానే.. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని డీజీపీని ఆదేశించింది.

ఎమ్మెల్యే ఎప్పుడూ వివాదమే..!

గత అసెంబ్లీ ఎన్నికల నుంచి ఎమ్మెల్యే రాజయ్య మహిళలకు సంబంధించిన ఏదో ఒక వివాదంలో తెరపైన కనిపిస్తూనే ఉన్నాడు. తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయనను కేబినెట్ నుంచి ఏకంగా బర్తరఫ్ చేయడం అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. దానిపై అనేక ముచ్చట్లు సైతం వినిపించాయి. ఇదిలా ఉంటే.. గతంలో వేలేరు మండలంలోని ఓ ఊరికి చెందిన మహిళతో ఫోన్‌లో అసభ్యకరంగా.. శవ్వ, శవ్వ అంటూ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడిన మాటలుగా.. ఆడియో రికార్డు ఆ రోజుల్లో పెద్ద చర్చనీయాంశం కాగా.. అది తన వాయిస్ కాదని రాజయ్య కొట్టిపారేశారు.

ఆ తర్వాత లింగాలఘణపురంలో జరిగిన ఓ జన్మదిన వేడుకల్లో సైతం ఎమ్మెల్యే చిలిపి చేష్టలు.. ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేశాయి. ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లాలో లక్ష మందికి పైగా పిల్లలు తన వల్లనే పుట్టారని వివాదాస్పద వ్యాఖ్యలు సైతం విమర్శలను ఎదుర్కొనేలా చేసింది. అలాగే లింగాలఘణపురం మండలంలో బతుకమ్మ చీరల పంపిణీలో సీఎం కేసీఆర్ అందరికీ భర్త లాంటి వాడని నోరుజారీ.. సరిచేసుకునే ప్రయత్నం చేశాడు. తాజాగా జానకీపురం సర్పంచ్ నవ్య ఎమ్మెల్యే తనను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని ఆరోపించడంతో ఎమ్మెల్యేకు అధిష్ఠానం నుంచి మొట్టికాయలు వేసే వరకు దారి తీసింది.

మహిళా కమిషన్ ఆదేశం.. పోలీసుల విచారణ

ఎమ్మెల్యే రాజయ్య తనను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని సర్పంచ్ నవ్య ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత స్పందించారు. కేసును సుమోటోగా తీసుకుని.. విచారణకు డీజీపీని ఆదేశించారు. దీంతో పరిస్థితి చేయిదాటి పోయే ప్రమాదం ఉందని గ్రహించిన ఎమ్మెల్యే.. పార్టీ పెద్దల సూచనలు పాటిస్తూ.. ఆదివారం జానకీపురంలోని సర్పంచ్ నవ్య ఇంటికి వెళ్లారు. సర్పంచ్ దంపతులతో కలిసి ఎమ్మెల్యే మీడియా ముందుకు వచ్చారు. ప్రొటో కాల్ విషయంలో ఎక్కడైనా ఇబ్బంది కలిగితే.. మహిళా లోకం తనను క్షమించాలని కోరగా.. నవ్య పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటానని చెబుతూనే.. ఎమ్మెల్యేకు పరోక్షంగా హెచ్చరికలను జారీ చేసింది. వేధింపులకు గురిచేసిన వారు ఎంతటి స్థాయిలో ఉన్నా ఊరుకునేది లేదని స్పష్టం చేసింది. ఎమ్మెల్యే సర్పంచ్ ఇంటికి వెళ్లడంతో నాలుగు రోజుల వివాదానికి తెర పడగా.. మహిళా కమిషన్ విచారణకు ఎమ్మెల్యే హాజరు కావాల్సి ఉంటుందా లేదా అనే విషయం తేలాల్సి ఉంది. ఇందుకు సంబంధించి సర్పంచ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే వ్యవహారంపై ఇంటలిజెన్స్ వర్గాలు ప్రభుత్వానికి నివేదిక అందించినట్లు సమాచారం. ఈ విషయమై సీఎంతోపాటు మంత్రి కేటీఆర్ సీరియస్ అయినట్లు తెలిసింది.

రెండు కిలోల గంజాయి పట్టివేత

- విక్రయదారుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి


నిందితుడి అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జితేందర్‌రెడ్డి

ఖిలా వరంగల్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతడి నుంచి రెండు కిలోల ఎండు గంజాయి, ఒక ఫోన్, ఆపిల్ ఐపాడ్, బజాజ్ పల్సర్ బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్‌రావు, ఎస్. వెంకటేశ్వర్లుతో కలిసి ఏసీపీ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన కొండపర్తి ఆదిత్య గంజాయికి బానిసయ్యాడు. ఒరిశా కలిమెల గ్రామంలో మొద్దు అలియాస్ బాయ్ వద్ద గంజాయి నిల్వలు ఉన్నాయన్న విషయాన్ని ఆదిత్య తెలుసుకుని బైక్‌పై వరంగల్ నుంచి భద్రాచలం మీదుగా ఒడిశా కలిమెల గ్రామానికి చేరుకుని మొద్దు వద్ద నిల్వ చేసి ఉన్న 3 కిలోల ఎండు గంజాయి కొన్నాడు. తిరిగి బైక్‌పై భద్రాచలం మీదుగా వరంగల్‌కు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులకు సైతం అనుమానం రాకుండా అత్యంత రహస్యంగా నిల్వ చేశాడు. అతను సేవిస్తూ, ఇతర స్నేహితులకు విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీసుల సహకారంతో వరంగల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గంజాయి విక్రయిస్తున్న కొండపర్తి ఆదిత్యపై దాడి చేశారు. అతడి వద్ద రెండు కిలోల ఎండు గంజాయి, ఒక ఫోన్, ఆపిల్ ఐపాడ్, బజాజ్ పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండ్‌కు తరలించారు. ఇప్పటికి అతడిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు, మెదక్ డిస్ట్రిక్ తూప్రాన్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. మొద్దు పరారీలో ఉండగా.. పట్టుబడిన కొండపర్తి ఆదిత్యపై కేసు నమోదు చేశారు. తదితపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు వి.లవన్‌కుమార్, ఎండి నైస్సార్ పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లు స్థలంలోనే కార్మికులకు ప్లాట్లు కేటాయించాలి

- ఎంవీఆర్‌ఎస్ యూనియన్ నాయకుల డిమాండ్


నినాదాలు చేస్తున్న ఎంవీఆర్‌ఎస్ నాయకులు

కాశిబుగ్గ : ఆజంజాహి మిల్లు స్థలంలోనే కార్మికులకు ప్లాట్లు కేటాయించాలని ఆజంజాహి మిల్లు మాడిఫైడ్ వలంటరీ రిటైర్‌మెంట్ సంఘం (ఎంవీఆర్‌ఎస్)లోని 318 మంది కార్మికులు డిమాండ్ చేశారు. ఆదివారం భగత్‌సింగ్‌నగర్‌లోని యూ ని యన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు, హైకోర్టు కార్మికులకు మిల్లు స్థలంలోనే ఇండ్ల స్థ లాలు కేటాయించాలని తీర్పు ఇచ్చాయని తెలి పారు. కానీ ఇక్కడ అధికారులు మాత్రం మిల్లు స్థలంలో ఇవ్వకుండా అనంతసాగర్, మడిపెల్లిలో కేటాయిస్తామంటూ తీసుకోవాలని మాపై ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. మాకు సరిపోయే మిల్లు భూమి ఉన్నప్పటికీ అక్కడ స్థలాలు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో అర్థంకావడం లేదన్నారు. ఎంవీఆర్‌ఎస్ యూనియన్ సభ్యులు బి.రామకృష్ణ, ఓంప్రకాశ్, యశోద, శంకర్, సందీప్ పాల్గొన్నారు.

వైభవంగా గంధం ఉత్సవాలు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి


చాదర్లు తీసుకొస్తున్న భక్తులు

- సైలానీ బాబా దర్గాను దర్శించుకున్న భక్తులు
- ఆకట్టుకున్న కళాకారులు, ఫకీర్ల విన్యాసాలు

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానిబాబా దర్గా గంధం ఉత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గంధం సమర్పణ కార్యక్రమం కోలాహలంగా సాగింది. వివిధ ప్రాంతాల భక్తులు తీసుకొచ్చిన చాదర్లను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. అనంతరం ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఒంటెలపై గంధం తీసుకొచ్చే తంతు ఆదివారం అర్ధరాత్రి కన్నుల పండువలా కొనసాగింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన డప్పు కళాకారుల నృత్యాలు, ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దర్గా ప్రధాన ద్వారం నుంచి దర్గా వరకు ఊరేగింపుగా వచ్చి గంధం సమర్పించారు. దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ (సైలాని బాబా) ప్రత్యేక ప్రార్థనలు చేయగా.. భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే

గంధం ఉత్సవాల్లో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి దర్గా పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్ (సైలాని బాబా) సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. దట్టికట్టి సత్కరించారు. ఉత్సవాల్లో పరకాల మున్సిపల్ చైర్మన్ సోద అనిత రామకృష్ణ, తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్, ఎంపీపీ కాగితాల శంకర్, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ ఎండీ.జాకీర్‌అలీ, పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, రైతు బంధు కో–ఆర్డినేటర్ బిల్లా రమణారెడ్డి, విద్యుత్ ఏఈ గుర్రం రమేశ్, ఒగ్లాపూర్ గ్రామావృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు, మహ్మద్ రషీద్‌బాబా, అమీర్ బాబా, ఖాదీమ్ హీ సైలానియా ఎస్‌కే మొయిన్, పోతుల కొమ్మాలు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరకాల ఏసీపీ జాపల్లి శివరామయ్య పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. సీఐలు శ్రీనివాసరావు, కుమార్ ఎస్సైలు మత్యం రాజేందర్, గైకాడి అనిల్‌కుమార్, వీరభద్రారావు, ప్రసాద్ ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొని భద్రతా చర్యలు చేపట్టారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

కాశిబుగ్గ : నర్సంపేట–వరంగల్ ప్రధాన రహదారి లేబర్‌కాలనీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగశాయిపేటకు చెందిన శ్రీపాద మనోహర్ కుటుంబ సభ్యులు గీసుకొండ మండలం కొమ్మాల జాతరకు కారులో వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో లేబర్‌కాలనీ సమీపంలో అతి వేగంతో వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో కారు ధ్వంసమై కారులో ఉన్న మనోహర్ కుటుంబ సభ్యులకు గాయాలయ్యాయి. స్థానికులు, బీజేపీ నాయకులు కనుకుంట్ల రంజిత్‌లు స్పందించి వెంటనే 108కు సమాచారం ఇచ్చి వారిని చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.